# ఆదర్శాల పర్యవసానం

ఆ అమ్మాయి పేరు మీనాక్షి.

అతని పేరు వెంకటేశ్వరరావు.

ప్రపంచంలో చాలమంది చదువుకున్న వాళ్ళకు మాదిరిగానే, వాళ్ళిద్దరికి కూడా కొన్ని ఆదర్శాలున్నయ్. ఆ ఆదర్శాలను ఆచరణలో పెట్టడానికి అవకాశాలు దొరికితే, వాళ్లు చాల సంతోషించే వాళ్ళకు మాదిరిగాను, తాము జీవిస్తున్నందుకు ఏదో ఒక ప్రసిద్ధమయింది — పోనీ ప్రసిద్ధమని వాళ్ళకు తోచింది— కార్యం చేశామని తొమ్ములు విరుచుకొనే అటువంటి అల్పసంతోషులుగాను కనుపించి జీవిత సాఫల్య మయిందని భావించేవాళ్ళు కూడా.

ఆ అమ్మాయి పద్దెనిమిదేళ్ళది అందచందాల్లో కాని, తెలివితేటల్లో కాని, ఆ వయస్సుకు తెలుగు దేశంలో ఆడపిల్లలు ఎట్లా వుంటారో ఆమే అలాగే వుంటుంది. అంతకు ఎక్కువా లేదు; తక్కువా లేదు.

ఆ అబ్బాయి ఇరవై మూడేళ్ళవాడు. అతనూ అంతే! అయితే, ఇరవై మూడేళ్ళకు తెలియవలసినంత కూడా తెలియని అమాయకుడిలా కనుపిస్తాడు– కనుపించటం వరకే!– ఆ అమ్మాయి అట్లా కనుపించదని కాదు. ఆ అమ్మాయిని యిది వరకే ఎరిగివుండి, ఆ అమ్మాయిమీద ఆ అభిప్రాయం వుంటే అట్లా కనుపించటం వేరు, ఏమీ యెరుగని వాళ్ళకు కనుపించటం వేరు.

ఆ అమ్మాయి యింటరు పూర్తిచేసి బి. ఏ లో చేరింది. అతను హిస్టరీ ఆనర్సు రెండో సంవత్సరం పూర్తిచేసి మూడో యేడు చదవబోతున్నాడు. అసలు వాళ్ళ పరిచయం యిది—

తెనాలి ఒకసారి అర్జంటుగా రమ్మని వుత్తరం వ్రాశాడు రాఘవరావు తమ్ముడికి. అన్నయ్య వుత్తరాలన్నీ, ఆయన కోర్టులో వాదించే వాదనలకు మాదిరిగానే, తలా తోకా లేకుండా వుంటాయని విసుక్కున్నాడు తమ్ముడు. నేను వెళ్ళనన్నాడు. 'అర్జంటంటున్నాడు, వెళ్ళిరా. అయినా ఎటూ మరో పది రోజుల్లో కాలేజీ తెరుస్తున్నారు కాబట్టి, అటునుంచి అటే మద్రాసు పోవచ్చు'నని పోరారు తల్లి తండ్రులు. ఇక తప్పక వచ్చింది తమ్ముడికి. ఈ సారి యిటువంటి వుత్తరాలు— విషయం లేకుండా, సస్పెన్స్ క్రియేట్ చేసేవి (ఉదాహరణకు మన చారిత్రక పరిశోధకుల ప్రసంగాల్లాంటివి)— రాయకుండా గట్టిగా మందలిద్దా మనుకున్నాడు అన్నగారిని.

వద్దని చెప్పడం, మందలించడం అక్కడకు చేరిన తర్వాత కదా! ఎలాగైతేనేం బయలుదేరాడు.

వేసంగి సెలవులకు స్నేహితులతో విశాఖపట్నం వెళ్ళిన అమ్మాయి యింకా తిరిగి రాలేదు. కాలేజీలు తెరచే రోజులు దగ్గర పడుతున్నవని, త్వరగా బయలుదేరి రమ్మని అమ్మాయికి వుత్తరం వ్రాశారు జిల్లా మున్సిఫ్ రామకృష్ణయ్య గారు. అయినా, ఆమెను ఏమనగలం? ఒక్కొక్కళ్ళ యిళ్ళలో నాలుగు రోజులపాటు కూడా వుండలేదు. అందరూ చెప్పడమే, యిక్కడకు వచ్చినంతసేపు పట్టలేదు మా యింట్లో వుండమని. ఎట్లాగైతేనేం, నాన్నగారి పుణ్యమా అని యీనాటికి బయలుదేరడానికి వీలు చిక్కింది.

శ్రీ

యం. నాగభూషణ శర్మ

తాడి యెక్కేవాణ్ణి తల తన్నేవాడు ఎప్పుడూ వుంటాడు. తెలివీ వుంది, స్ట్రిక్టుగానూ వుండగల టి. సి లను ప్రభుత్వం వేస్తే, వాళ్ళ తల్లోనుంచి వెళ్ళుకొచ్చిన వాళ్ళు టిక్కెట్టు లేకుండా, నడుస్తున్న రైలు బళ్ళన్నీ తమ స్వంతమైనట్టుగా ప్రవర్తించి, అధికారుల కళ్ళల్లో దుమ్ము కొడుతున్నారు. అటువంటివాళ్ళు కూర్చున్నారు ఆ పెట్టె సగానికి వీళ్ళకు తోడు ఒక పెళ్ళి బృందం! కూర్చున్న వాళ్ళను కొత్తగా వచ్చినవాళ్లు జరగమనడం, వాళ్లు చోటు లేదనడం; చోటు యివ్వలేదన్న కోపంతో కూర్చున్న వాళ్ళకు వూపిరాడకుండా వాళ్ళ కడ్డంగా నిలబడడం, వాళ్ళ కాళ్ళు గట్టిగా తొక్కి చూడలేదనడం— ఇవన్నీ చూస్తూ కూర్చున్న ఆ అమ్మాయికి మనుష్యుల మనస్సులు యీ చిన్న సంఘటనలో కూడా ఎంత సంకుచితాలో ననుకొని, వాళ్ళు కసితీర్చుకోవడానికి చేస్తున్న పనులను చూసి నవ్వుతూంది.

ఇంతలో ఆమె కాలు కూడా ఎవరో తొక్కారు. నామీద ఎవరికా కసి అనుకుంటూ వెనక్కు తిరిగింది అతను కనుపించాడు........

"వెరీ సారీ— ఐ బెగ్ యువర్ పార్డన్... కంపార్టుమెంట్ చాల యిరుగ్గా వుంది, చూడలేదు" అన్నాడు

దానికి తప్పులు దణ్ణంతో సరి! ఇంకేం! నిజమైన పశ్చాత్తాపం సర్వపాప పరిహారం కదా! ఆమె నవ్వుతూ "పరవాలేదు లెండి" అన్నది.

ఇదీ వాళ్ళ పరిచయం........

రెండు గంటల రైలు ప్రయాణంలో రెండు తరాల మనుష్యులను, వాళ్ళ అభిరుచులను, వింత వింత మనస్తత్వాలను, జాతీయాంతర్జాతీయ విషయా లన్నింటినీ సమీక్షించారు. ముందు పేర్లు, వూర్లు, వుద్యోగాలు, పుట్టు పూర్వోత్తరాలు, తరువాత సినిమాలు, వాటివల్ల ప్రజలు చెడిపోతున్న విధం, జ్ఞానాన్ని సంపాదించుకొనే విధం— ఇన్నీ అయిన తర్వాత పెళ్ళిళ్ళ మీదకు మళ్ళింది సంభాషణ.

"ఏమో నండి. ఇప్పుడప్పుడే పెళ్ళిచేసుకోవడ మంటే మనలను మనం మోసం చేసుకోవడ మన్నమాట. మనకు సరిగ్గా మనుష్యులను అర్థం చేసుకొనే తెలివితేటలు కూడా రాలేదు. మన జీవితాన్ని మనం పోషించుకోలేం; మరొకళ్ళ జీవితాన్ని పోషించడానికి పూనుకోవడం అవివేకం; తాను దూర కంత లేదు; మెడ కొక డోలట!"

"మీ మగవాళ్ళందరూ యింతేనండి. మీ సంగతి మీ రాలోచిస్తారు. ఎదుటివాళ్ళ విషయం మీ కక్కరలేదు. మీకుమాత్రం చదువుకున్న భార్య కావాలి కాని, మీ చెల్లెళ్ళకు స్వాతంత్ర్యం యిచ్చి, చదువు చెప్పించలేరు.... మీ అంత స్వార్థపరులు మరెక్కడా కనుపించరు."


"మీరు 'మగవాళ్ళందరూ' అంటూ వాళ్ళలో నన్ను కూడా కలపకండి. ఆదర్శాలకోసం బ్రతకాలని నా ఆశయం....

"నా కింతవరకూ యెన్నో సంబంధాలు వచ్చినయ్. అమ్మకానికి పెట్టిన వస్తువును చూచినట్లుగా స్త్రీని నేను చూడదలుచుకోలేదు........ అయినా, ఒకవేళ యిప్పుడు పెళ్ళి చేసుకుంటా ననుకోండి... ఆ వచ్చినావిణ్ణి సంతోషపెట్టడం నా విధి కదా! ఆవిడకు మల్లెపూలు కావాలంటే మా నాన్నను 'నాన్నా! మా ఆవిడకు మల్లెపూలు కావాలట, ఒక బేడ యివ్వు!' అని అడగాలి..."

ఆవిడ కూడా అతను చెప్పిన వన్నీ నిజమేనని ఒప్పుకున్నది.

తాను, ఆరు నూరైనా సరే, నూరు ఆరైనా సరే, యిప్పుడు పెళ్ళిమాట తలపెట్ట నన్నాడు.

తాను కూడా ససేమిరా తన చదువు (డిగ్రీ వచ్చేటంతవరకు కావచ్చు. లేకపోతే చదువుకు అంతం ఎక్కడ?) పూర్తికానిది పెళ్ళిచేసుకో నన్నది.



వాళ్లున్న పెట్టెలోకి ఎవ్వరూ ఎక్కలేదు

నిజంగా చాల మంచి భావాలు కలవాళ్ళే; ప్రపంచంలో అందరూ యింతటి పట్టుదల కల వాళ్ళే వుంటే లోకమూ, తద్వారా సంఘమూ చాలవరకూ బాగుపడవచ్చు.

ప్రపంచంలో విప్లవానికి నాంది అదే కదా!

ఏది ఏమైనా తమ ఆదర్శాలను నిలబెట్టుకోవాలి, తమలాంటి ఏ కొంత మందికైనా ఆదర్శ ప్రాయులం కావాలని దృఢనిశ్చయానికి వచ్చారు యిద్దరూ।

బెజవాడ వచ్చేసరికి బండి దాదాపూ ఖాళీ అయిపోయింది. ఇద్దరూ కాఫీ త్రాగారు. ఆగిపోయిన ప్రసంగం ప్లాట్‌ఫారాలదగ్గర బయలుదేరి ప్రభుత్వం వరకూ పోయి, ప్రతి మనిషీ ఆత్మ విమర్శన చేసుకొని మంచి చెడ్డలను నిర్ణయించుకో గలిగితే దేశం బాగుపడుతుందన్న ఏకగ్రీవ తీర్మానం దగ్గర ఆగిపోయింది.

ఇంజను కడుపు నింపుకొని హాయిగా త్రేలుస్తున్నది. వాళ్ళున్న పెట్టెలోకి ఎవ్వరూ ఎక్కలేదు. చాలమంది ఎక్కడానికి ప్రయత్నించడం, ఆ యిద్దరి 'ఏకాంతాన్ని' భంగపరచడానికి యిష్టం లేనట్టుగా వెధవ మొహాలు (వాళ్ళ దృష్టిలో) వేసుకొని వెళ్ళిపోవడం జరుగుతున్నది. మొదట అట్లా చేసుకున్న ఒకరిద్దర్ని చూసి వాళ్ళ అజ్ఞానానికి నవ్వుకున్నారు. తరువాత వచ్చిన అసంఖ్యాకమైన ప్రయాణీకులను ఎవరికి వాళ్ళు గమనించడం, గమనించనట్లు నటించడం మామూలైంది. ఎప్పటికీ బండి కదలదేమన్నంత విసుగ్గా వుంది. వాళ్ళతోపాటు ఆ మనుష్యులు కూడా వచ్చి కూర్చుంటే ఏ యిబ్బందీ వుండేది కాదు. కాని యిట్లా రావటం, చూడటం, నవ్వుకుంటూ వెళ్ళిపోవటం యిద్దరికీ అసహ్యంగానేవుంది. తమ సఖ్యతను ప్రపంచం అంతా అపార్థం చేసుకున్నదని యిద్దరికీ బాధగానే వున్నది. మొదటి యిద్దర్నీ చూసి ఏ కొంత అంధకారంలో వున్నారో నన్నట్లుగా నవ్వారు. అలా చాలమంది చేసేసరికి విచారం. — లోకంలో అన్నీ అంతే కదా! 'ఆఫారా' బుష్ షర్టులు వేస్తే మొదటి యిద్దరూ వికారులు, తరువాత వేస్తే ఫాషన్! ఆడీ యింతే! — మగవాళ్ళు, ఆడవాళ్లు ఏవిధమైన సంబంధమూ లేకుండా సఖ్యతగా వుండకూడదా? ఇట్లా కూర్చుని, మాట్లాడుకోవటం కూడా తప్పేనా? లోకం యింత చిన్న విషయానికి ఎలాంటి అర్థాలు కల్పిస్తుందో!

ప్రపంచాన్ని నడుపుతున్న సూత్రధారిలా గార్డు జండా వూపాడు. బండి బయలుదేరబోతూ వుండగా ఒక ముసలావిడ వచ్చి ఆ పెట్టెలో యెక్కింది. "అమ్మయ్య!" అని ఏదో తలమీద పెట్టిన బరువును దించుకున్నవాళ్ళకు మాదిరిగా నిట్టూర్చారిద్దరూ.

వాళ్ళకు అవతలిపక్కన కూర్చుంటూ, "ఎక్కడ చూసినా యెక్కేటందుకు వీలుకూడా లేదు బాబూ, పెద్దదాన్ని.........ఏదో యీ పెట్టె ఖాళీగా వుందని ఎక్కాను." అంటూ మొదలుపెట్టింది. ఈ పెట్టెలో ఎక్కడమే నేరమైనట్టూ, దాన్ని సమర్థించుకుంటున్నట్లూ.

"వచ్చే స్టేషనులోనే దిగిపోతానులే బాబూ! ఏమీ అనుకోకండి."

వెంకటేశ్వరరావుకు అరికాలి మంట నెత్తికెక్కింది.

"ఫరవాలేదులెండి మీరు రావడం చాల మంచిదయింది. ఇందాకట్నుంచీ అనుకుంటున్నాం 'ఎవరైనా మూడో మనిషివస్తే ఎంత బాగుండునురా' అని........"

ఈ మాటలకావిడ చాలా నొచ్చుకున్నది. ఆ నొచ్చుకోవడాన్ని ఆవిడ యే విధంగానూ దాచదలచుకోలేదు

"అట్లా అనకూడదు నాయనా!" అంటూ తన అనుభవాలన్నింటినీ చెప్పటం మొదలుపెట్టింది........"అట్లా అనకూడదు నాయనా! మనం బ్రతికేదే మూన్నాళ్ళు ఈ ముచ్చటకోసం

(మిగతా 60 వ పేజీలో)

# ఆదర్శాల పర్యవసానం

(28 వ పేజీ తరువాయి)

పోట్లాటలెందుకు? బ్రతికినన్నాళ్ళూ అరమరికలు లేకుండా సంతోషంతో గడపాలి......... ఆయన బ్రతికుండగా మేమంతే నాయనా!" ఈ అనుభవాలు, వాళ్ళ దాంపత్యానికి ఎవరెవరు ఏమని సర్టిఫికేట్ లిచ్చిందీ-అన్నీ చెప్పింది, పక్కవాళ్ళు మాట్లాడడానికి కూడా సందు దొరకకుండా.

ఇంతలో కృష్ణా కెనాల్ స్టేషను రావడం, ఆవిడ దిగిపోవడానికి ప్రయత్నం చేయడం జరిగినయ్. లేస్తూనే, "నాయనా! జీవితా లన్నతరువాత పోట్లాటలు రాకుండా పోతయ్యా! వచ్చిన వాటిని సర్దుకుపోవడంలోనే వుంది మన సహనం. అమ్మాయ్ చిన్న పిల్లాయిరి. జాగ్రత్తగా పువ్వుల్లో పెట్టి పూజించుకోవాలి.........ఇది బాగుండదు నాయనా!".........అంటూ నాలుగు కాలాలపాటు హాయిగా వుండండంటూ నిష్క్రమించింది.

ఆవిడను అక్కడ ఆపి ఆవిడకు నిజం చెబుదామనుకున్నాడు వెంకటేశ్వరరావు. కాని ఏదో పని మించుకు పోయినట్లుగా బయలుదేరిం దా రైలు, పెద్దగా కేరింతలు కొడుతూ.

కనుచూపు మేరవరకూ ఆమెనే చూస్తూవుండి పోయారు యిద్దరూ. పది సెకండ్ల తరువాత యిద్దరూ కోపంతో "బ్రూట్! ఒట్టి అడవి మనిషిలా వుందే!" అనీ, "ఛీ! అసలు ప్రపంచమే యింత పీచంగా వుంది. స్త్రీ పురుషుల సఖ్యతకు అపార్థాలు తీస్తుంది" అనీ కామెంట్ చేశారు.

ఇక బండి తెనాలి చేరేవరకూ వాళ్ళు ఎవరెవరి విషయంలో లోకం యిలా అపార్థాలు తీసిందో, వాటి ఫలితాలేమిటో—అన్నీ చెప్పుకున్నారు.

"మా కాలేజీలో ఒక అమ్మాయి వున్నదండి. ఆ అమ్మాయి పేరుతో, ఒక లెక్చరర్ పేరు చేర్చి, కాలేజీ గోడలనిండా ఏమి ఏమిటో రాశారు...ఇంతకూ చిత్రం చూశారా! మరో నాలుగు రోజుల్లో వాళ్ళిద్దరూ "రిజిస్టర్ మారేజి" చేసుకున్నారు." అన్నది మీనాక్షి.

"నిజంగానా!" ఆశ్చర్యపోయారు వెంకటేశ్వరరావు.

"నిజమే. ఇందులో మీ వుద్దేశ్యం యేమిటి?"

"వుద్దేశ్యాలకేంగాని, లోకం మనుష్యులను, స్నేహాన్ని అర్థం చేసుకోనప్పుడు చెయ్యవలసినవి రెండే పనులు. ఒకటి వాళ్ళ కనుగుణంగా నడవడం (అది చేతకానివాళ్ళ విషయంలో సుమండీ!); రెండోది-సంఘాన్ని, అలా ప్రచారంచేసే వాళ్ళను ఎదిరించి వాళ్ళ స్నేహంలో వున్న నిజాయితీని నిరూపించుకోవడం మనోదార్ఢ్యం గల ఏ కొద్ది మందో నాని అలా నిరూపించుకో జేరు."

"అవును. చదువున్న వాళ్ళమయినా ఆదర్శాలకోసం ఎన్ని అడ్డంకులు వచ్చినా ఎదిరించాలి."

"తప్పకుండాను."

తెనాలి వచ్చింది. బండి ఎంత సేపటికీ కదలదేమనుకున్నవాళ్ళు, తెనాలి వచ్చేసరికి యింత త్వరగా వచ్చిందా అనుకోకుండా వుండలేక పోయినారు. మానవ ప్రకృతి! తమను గురించిగాని, తమ కష్టాలను గురించిగాని, శ్రద్ధగా విన్న వాళ్ళను విడిపోవడం కొంచెం కష్టమే మరి!

"నా పెళ్ళికి యిప్పు దేం తొందర వచ్చింది నాన్నా?"

"అదేమిటమ్మా! ఇంతవరకూ వుంచినందుకే నలుగురిలో నగుబాట్లుగా వుంది."

"ఈ చదువు యిట్లా మధ్యలో ఆగిపోతే...."

"అదా నీ బాధ! వాళ్ళంతా చదువుకున్న వాళ్ళమ్మా! నువ్వు చదువుకోవడానికి ఏ మాత్రం అభ్యంతర పెట్టరు."

అదది అంతకంటె సిగ్గువిడిచి యేం చెప్ప గలదు? తండ్రి అన్నిటికీ ఎదురు చెబుతూ వుండె! సంఘమే అలావున్న దసలు. దాని పాత చింతకాయ పచ్చడిలాంటి అభిప్రాయాలను అది మార్చుకోదు. మరొకళ్ళు మార్చుకుంటే చూడ లేదు. "అటువం టప్పుడు తన తండ్రి కూడా అట్లా అడగడంలో తప్పేముంది?" అనుకున్నది మీనాక్షి.

ఆడపిల్లను చూసిన ప్రతివాళ్ళూ నాలుగేళ్ళ దగ్గరనుంచీ అడుగుతూ నేవుంటారు "ఆ అమ్మాయ్ పెళ్ళి ఎప్పు"డని! పదేళ్ళకే సమస్య! తమకు పిండి వంటలతో భోజనాలు పెట్టడంకోసం పెళ్ళి! వాళ్ళ భోజనాలలోకి జీవితాల కూరలు చేసి వడ్డిస్తారు తల్లితండ్రులు!

అధికార్లకోసం పెళ్ళి. పూళ్ళోవాళ్ళకోసం పెళ్ళి. అప్రదిష్ఠను గొంతు పిసికి చంపి, కీర్తిని తమ వంటయింట్లో కట్టివేసుకోవడానికి పెళ్ళి!

ఈ విధానం మారటం ఎలా? నాన్నకు ఎదురు చెప్పలేదు. తండ్రి చెప్పినదీ సబబుగానే వున్నది కదా! చివరకు ఒప్పుకోక తప్పలేదు మీనాక్షికి.

పెళ్ళి చూపులు గుంటూరులో బాబాయిగారింటికి, నాన్నా, అమ్మా, తనూ వెళ్ళారు. సాయంకాలం నాలుగింటికి పెళ్ళివారు వచ్చారు. మీనాక్షికేమీ నచ్చలేదు. వంచిన తల అలాగే వుండి పోయింది. నాన్నగారు దగ్గరగావచ్చి "చూడమ్మా! అతనే పెళ్ళికొడుకు."

ఎలాగో తలయెత్తి చూచింది. ఎదురుగా వెంకటేశ్వరరావు!

"అతని పేరు వెంకటేశ్వరరావు. మద్రాసులో ఫైనల్ ఆనర్స్ చదువుతున్నాడు........"

నాన్నగారు ఏమేమో చెప్పుకు పోతున్నారు. తరువాత ఒక్క మాటా వినిపించలేదామెకు.

అమ్మాయి త్వరగా ఒప్పుకోదేమో ననుకున్న తండ్రికి దానికి విరుద్ధంగా జరిగేసరికి ఆశ్చర్యం వేసింది.

ముహూర్తాలు కూడా పెట్టుకున్నారు.

పెళ్ళినాటిరాత్రి పూరేగింపులో వెంకటేశ్వరరావు మీనాక్షి నడిగాడు—

"ఆదర్శాలు అన్నీ ఏమైనయ్?"

"మీవో?"

"అనుభవాల వెనకాల దాక్కున్నయ్. అదీ కాక యీ ఏటితో ఆనర్స్ అయిపోతుంది. వచ్చే యేడు ఏదో కాలేజీలో చేరతాను. అప్పుడు నిన్ను తీసుకువెళ్ళడానికి అభ్యంతరం వుండదుగా!"

రైల్లో ముసలావిడ యిచ్చిన ఆశీర్వాదం సిగ్గుపడ్డ హృదయాలను యింకా దగ్గరకు చేర్చింది.

చిన్నబోయిన "ఆదర్శాలగోల" పెళ్ళివారి రణగొణ ధ్వనిలోనూ, ఢంకాల మ్రోతల్లోనూ ఎక్కడా వినిపించలేదు. ★

పరిమళద్రవ్యోత్పత్తిలో 3 అమూల్యరత్నాలు

ఘుం ఘుం జవాజ్ ★ ఘుంపాల్

★ ఘమగర్ అగరువత్తులు

డి. ఎల్. సుగంధాలయ

సుగంధ ద్రవ్య వ్యాపారులు, బెంగుళూరు-2